సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ၊ 29 ၊ ఏప్రిల్ ၊ 2023



వీరంపల్లిలో ప్రాచీన అవశేషాలు

చరిత్ర పరిశోధకుడు షేక్ రసూల్ అహ్మద్, కేంద్ర ప్రభుత్వ శాసన అధ్యయన విభాగం చెన్నై శాఖకి చెందిన ఎం.ఏసుబాబు, అలగేశన్, యువరాజ్ శుక్రవారం మండలంలోని వీరంపల్లిలో పర్యటించారు. IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,990
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,537
3 శాతం జీఎస్టీతో	రూ.5,703
నవర (8 గ్రా)	రూ.45,624

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /28.0

వాతావరణం

శుక్రవారం గాలిలో 62 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఆనందంగా సొంతింట్లోకి..

అది కావలిలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహ సముదాయం. ఎప్పుడూ లేనంత సందడి శుక్రవారం అక్కడ కనిపించింది. ఎన్నో సంవత్సరాల నాటి సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. పండగ వాతావరణంలో పాలు పొంగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇది మా ఇల్లు.. అంటూ బంధుమిత్రులకు చూపిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు.

- కావలిలో టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి సురేష్
- పాలు పొంగించి సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- పేదల సంక్షేమమే లక్ష్యమని మంత్రి వెల్లడి



లబ్ధిదారుకు భారీ నమూనా తాళం అందజేస్తున్న మంత్రి సురేష్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి తదితరులు

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో రూ.161.11 కోట్లతో నిర్మించిన 2,112 టిడ్కో గృహ సముదాయాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లబ్ధిదారులకు నమూనా ఇంటి తాళాలు అప్పగించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేశారన్నారు. ఆయన పాలనకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు పోలికే లేదన్నారు. జగన్ పేదల సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ఎన్నికల సమీపించగానే గృహ ప్రవేశాలంటూ లబ్ధిదారులను మోసం చేసిందని గుర్తు చేశారు. నిరంతరం ప్రజలకు మేలు చేయాలని తపించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహ సముదాయాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఆ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగిస్తున్నట్లు చెప్పారు. అలాగే 200 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఇళ్లను లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలని సీఎం ఆదేశించారన్నారు. చంద్రబాబు హయాంలో లబ్ధిదారులపై రుణ భారం మోపారన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆ పరిస్థితి లేదన్నారు.

కావలి అభివృద్ధికి కృషి

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన తనను రాజ్యసభ సభ్యుడిని చేశారన్నారు.

గత ప్రభుత్వ హయాంలో దోపిడీ

కావలి పట్టణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్ ద్వారా గత చంద్రబాబు ప్రభుత్వం రూ.400 కోట్ల కుంభకోణం చేసిందని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. చదరపు అడుగుకు బెంగళూరులో రూ.1,600 మాత్రమే చెల్లిస్తుంటే.. కావలిలో టిడ్కో ఇళ్లకు చదరపు అడుగుకు రూ.3,500 వరకు కాంట్రాక్టర్‌కు చెల్లించి లబ్ధిదారులపై రుణ భారం వేసిన పాపాన్ని అప్పటి ప్రభుత్వం మూటకట్టుకుందన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి దోచుకుందన్నారు.



గృహ ప్రవేశం చేసి
ఇంటి పత్రాలను చూపుతున్న కుటుంబం



గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులు

ఎమ్మెల్యే వినతి మేరకు..

కావలి పట్టణంలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.45 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి కోరారని మంత్రి వెల్లడించారు. ప్రతిపాదనలు పంపితే తగిన చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల సముదాయం వెనుక చెరువు ఉన్నందున, గోడ నిర్మించేందుకు రూ.2 కోట్ల అంచనాలతో అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారని ఎమ్మెల్యే తెలిపారని, దానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కావలి మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ తదితరులు పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో లిఫ్ట్ వసతి కల్పించాలని మంత్రిని కోరారు. స్పందించిన సురేష్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

పాలాభిషేకం

గృహ ప్రవేశాల కార్యక్రమాల్లో సురేష్, బీద మస్తాన్‌రావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీకి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ యు.శ్రీనివాసరావు, కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, నాయకులు పందిటి కామరాజు, పానుగోటి అనురాధ, షేక్ షాహుల్ హమీద్, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, కుందుర్తి కామయ్య, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రుణపడి ఉంటాం

నా భర్త లారీ డ్రైవర్. అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం ఉచితంగా అపార్ట్‌మెంట్‌లో ఇంటిని ఇవ్వడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇంటికి లోన్ తీసుకోవాలని చెప్పారు. అప్పు ఎంతకాలం కట్టాలో అని బాధపడే వాళ్లం. కానీ ఈ ప్రభుత్వం ఉచితంగానే ఇల్లు ఇచ్చినందుకు రుణపడి ఉంటాం.

– కొండా తిరుపతమ్మ, లబ్ధిదారు

న్యూస్‌రీల్

అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(పొగతోట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, ఏఎస్పీ హిమవతి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, సౌజన్య, వెంకటదాస్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, సమగ్ర శిక్ష ఏపీఓ ఉషారాణి, డీఈఓ గంగాభవాని, తదితరులు హాజరయ్యారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 625 మెగావాట్లు, రెండులో 580 మెగావాట్లు, మూడో యూనిట్లో 500 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు వెల్లడించారు.

రేపు లాస్ట్ వర్కింగ్ డే

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ఈనెల 30వ తేదీని లాస్ట్ వర్కింగ్ డేగా ప్రకటించారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ వద్ద, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెడ్‌మాస్టర్లు డిప్యూటీ డీఈఓల దగ్గర అనుమతి తీసుకుని ప్రమోషన్ చార్ట్‌లను తయారు చేశారు. శని, ఆదివారాల్లో తల్లిదండ్రులను పిలిచి వారి పిల్లల మార్కులు, గ్రేడ్లు, హాజరు తదితర వివరాలున్న ప్రోగ్రెస్ కార్డులను అందజేయనున్నారు. సెలవుల అనంతరం జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి.

మే చివరి నుంచి అందుబాటులోకి నానో డీఏపీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో మే నెల చివరి నుంచి నానో డీఏపీని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఇఫ్కో జిల్లా మేనేజర్ బీఆర్ లక్ష్మీనారాయణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది చాలా తక్కువ ఖర్చుతో లభిస్తుందన్నారు. హాఫ్ లీటర్ బాటిల్ ఒక ఎకరాకు సరిపోతుందన్నారు. ఎటువంటి హానికరం కాదని, రైతులు తీసుకెళ్లవచ్చని తెలియజేశారు.

భూముల ఆక్రమణపై వివరణ ఇవ్వండి

- దేవదాయ శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్న కస్తూరిదేవి విద్యాలయానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో వివరణ ఇవ్వాలని దేవదాయ శాఖను హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని చెప్పింది. ఇందులో భాగంగా పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూరిదేవి విద్యాలయానికి చెందిన 17 ఎకరాల భూముల్లో 10 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని, యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా దేవదాయ శాఖ పట్టించుకోవడం లేదంటూ నెల్లూరుకు చెందిన పొన్నలూరు పురంధర్‌రెడ్డి, నీలం మల్లికార్జునరావు, రాయి నర్సింహారావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ, ఆడపిల్లలకు విద్యను అందించాలని పొనకా కనకమ్మ, రాఘవాచారి 17 ఎకరాల భూమిలో కస్తూరిదేవి విద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఈ విద్యా సంస్థ ట్రస్ట్ కింద ఏర్పాటైందని, దీనిని నిర్వహించలేక భూములను దేవదాయ శాఖకు స్వాధీనం చేశారన్నారు. ఈ భూములు ఆక్రమణలకు గురవుతున్నా, నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి మండపాలు కడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులను ఆదేశించింది.

విద్యార్థిని ఆత్మహత్య

ముత్తుకూరు: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బ్రహ్మయ్యపాళెం పంచాయతీలోని పోతునాయుడుదిబ్బలో శుక్రవారం జరిగింది. ఎస్సై శివకృష్ణారెడ్డి కథనం మేరకు.. ఎం.నిహారిక (20) నెల్లూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతోంది. పరీక్ష ఫలితాల్లో ఒక సబ్జెక్ట్‌లో ఫెయిలైంది. కన్నవాళ్లు నిందించడంతో నిహారిక తీవ్ర మనస్తాపం చెందింది. ఎగ్జామ్ ఫీజు కట్టేందుకు గురువారం రాత్రి డబ్బు అడగ్గా తల్లి ఆగ్రహించడంతో భోజనం మానేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీర బిగించి ఉరేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.



నిహారిక మృతదేహం

సోమిరెడ్డి రాజకీయ అజ్ఞాని

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయ అజ్ఞాని. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో కనీస అవగాహన కూడా లేకుండా జిల్లా ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి పసలేని ఆరోపణలు చేశారు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యగారిపాళెం ఎస్సీ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టీఐ ద్వారా సమాచారాన్ని ఎలా పొందుతారో కూడా తెలియకుండా సోమిరెడ్డి రాజకీయాలు వెలగబెడుతున్నట్టు తెలిపారు. ముందుగా రూ.10 చెల్లించి సమాచారం అడిగాలన్నారు. అధికారులు ఇవ్వాల్సిన పూర్తి సమాచారానికి అయ్యే ఖర్చులను చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే సోమిరెడ్డి రూ.2 వేలు చెల్లించాను.. 180 పేజీలే ఇచ్చి మిగిలిన నగదు తిరిగి ఇచ్చారని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమాచారం అందజేయడంలో మంత్రి ప్రమేయం ఉందనడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పొదలకూరు మండలంలో ఎవరో ఒకరి సహకారం లేకుండా ఏ ఒక్క గ్రామానికి దారి తెలుసుకుని వెళ్లలేని సోమిరెడ్డి మండలంలో అభివృద్ధి పనులు చేశానని ప్రచారం చేసుకోవడం వింతగా ఉందన్నారు. జెడ్పీ చైర్మన్‌గా పనిచేసినప్పటి నుంచి పొదలకూరు మండలాన్ని అభివృద్ధి చేసింది తానేనని మంత్రి పేర్కొన్నారు. వచ్చే నెలాఖరుకు సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. గడప గడపకు కార్యక్రమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని, ఇందుకోసం అధికారులు పూర్తి వివరాలు పరిశీలించి నివేదిక అందజేస్తే అవసరమైతే అదనంగా నిధులను మంజూరు చేయిస్తామన్నారు. అధికారులు, ఉద్యోగులు కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, తోడేరు ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ, నాయకులు జి.గోపాలయ్య, కండే నరసింహులు, వై.వేణురెడ్డి, కె.పెంచలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు

మామిడి రైతుకు అకాల నష్టం

ఉలవపాడు మామిడి.. ఈ పేరు తెలియని వారుండరు. దీనికి అంతర్జాతీయ మార్కెట్ ఉంది. అయితే ఈ ఏడాది పరిస్థితులు మారిపోయాయి. ఓ వైపు తెగుళ్లతో మామిడి కాపు అంతంతమాత్రంగా ఉంది. మరోవైపు అకాల వర్షాలతో చెట్టుకు ఉన్న అరకొర కాయలు నేలరాలాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టుబడులు చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

- అకాల వర్షాలతో పంట నష్టం
- ఈదురుగాలులతో రాలిపోయిన కాయలు
- ఈ ఏడాది మార్కెట్‌పై తీవ్ర ప్రభావం
- కందుకూరు నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో సాగు



ఇటీవల గుడ్లూరు మండలంలో కూలిన మామిడి చెట్టు

కందుకూరు: జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా మామిడి సాగులో ఉంది. ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, కందుకూరు మండలాల్లో మామిడి 15 వేల ఎకరాల వరకు సాగులో ఉంది. అత్యధికంగా ఉలవపాడు మండలంలో పది వేల ఎకరాల్లో, గుడ్లూరులో 3,500, కందుకూరు, లింగసముద్రం మండలాల్లో 500 ఎకరాల చొప్పున తోటలున్నాయి. ఇంకా వింజమూరు, కావలి ప్రాంతాల్లోనూ సాగు చేస్తుంటారు. అయితే ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో పండే మామిడి ప్రఖ్యాతి గాంచింది. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, తోతాపురి, సువర్ణరేఖ, ఇమామ్ వంటి ఇక్కడే పండే రకాలకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. రెండేళ్ల నుంచి సరైన దిగుబడుల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పండుఈగ, తామరపురుగు వంటి తెగుళ్ల సోకడం, వాటి నివారణకు మందులు లేకపోవడంతో ఉధృతిని తగ్గించడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. పూత దశ నుంచే వీటి ప్రభావం ఉండడంతో కాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండడంలేదు. సాధారణంగా ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది మాత్రం పరిస్థితులు తలకిందులయ్యాయని ఇప్పటికే అధికారులు, రైతులు అంచనా వేశారు.

అకాల వర్షం కారణంగా..

సోమవారం కురిసిన భారీ అకాల వర్షాలు, బలమైన ఈదురుగాలుల కారణంగా ఉన్న కాయలు నేలరాలాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గుడ్లూరు, కందుకూరు మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండగా, ఉలవపాడు మండలంలో కొంత భాగంలో ఉంది. అక్కడక్కడా అరకొరగా కాయలున్నా నాణ్యత దెబ్బతింటోంది. మరో వారంరోజుల్లో కొద్దిపాటి కాయలు చేతికొచ్చి అమ్ముకునే అవకాశం ఉందని రైతులు భావిస్తున్న నేపథ్యంలో అకాల వర్షం నిండా ముంచింది. నాణ్యతను చూసి మాత్రమే వ్యాపారులు కాయలు కొనుగోలు చేస్తారు. ఏ మాత్రం నాణ్యత లేకపోయినా ధరలు తగ్గిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈదురుగాలులకు రాలిన కాయలు

తీవ్ర ప్రభావం

ప్రతి ఏడాది ఉలవపాడు కేంద్రంగా మామిడి వ్యాపారం పెద్దఎత్తున సాగుతుంది. 30 వేల టన్నులకు పైగా మామిడి వ్యాపారం జరుగుతుంది. అంతా బాగుంటే విదేశాలకు ఇక్కడి నుంచి కాయలు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం టన్ను ధర రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంది. అయితే దిగుబడి లేకపోవడంతో రేటు ఇంకా పెరిగే అవకాశం ఉంది. కానీ వర్షం అసలు కాయలే లేకుండా చేసింది. ఇది మార్కెట్‌పై తీవ్ర చూపుతోంది. ప్రస్తుతం చెట్ల నుంచి రాలిన పచ్చి కాయలను ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు. కొందరు లోకల్ మార్కెట్‌లో వచ్చిన రేటుకు అమ్ముకుంటుండగా మరికొందరు పనికిరాని కాయలను పారేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రావు

తెగుళ్ల ఉధృతిని తట్టుకునేందుకు రైతులు అధికంగా పురుగు మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పెట్టుబడులు పెరిగాయి. అలాగే మొదట్లో ఎకరాకు రూ.50 వేల వరకు కౌలు చెల్లించి తీసుకున్నారు. ఇలా పెట్టుబడులు రూ.లక్ష వరకూ పెరిగే పరిస్థితి నెలకొంది. తోటల్లో ప్రస్తుతం చూస్తే పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యే లేఖ

మామిడి రైతులను ఆదుకోవాలంటూ కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ప్రస్తుతం రైతులు ఇబ్బందుల్లో ఉన్నందున నష్ట పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

అకాలవర్షాల వల్ల మామిడి పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. గుడ్లూరు మండలంలో ఎక్కువగా, ఉలవపాడులో కొంత భాగం మేర కాయలు రాలిపోయాయి. నష్టంపై ప్రాథమిక నివేదికను అయితే పంపాం. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి.

– బ్రహ్మసాయి, ఉద్యాన శాఖ అధికారి, కందుకూరు డివిజన్

ఈవీఎంల గోదాము పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎంల గోదామును కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, బ్యాటరీల పనితీరును చూశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని సూచనలిచ్చారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సోమశిలలో 51.213 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 51.213 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 188 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 96.527 మీటర్ల నీటి మట్టం ఉంది.

నీటి దందా

మినరల్ వాటర్ ప్లాంట్ల పేరుతో శుద్ధజల కేంద్రాల నిర్వాహకులు నీటి దందా కొనసాగిస్తున్నారు. ప్రజల అవసరాలే లక్ష్యంగా నిబంధనలను గాలికొదిలి నీటిని సరిగా శుద్ధి చేయకుండానే విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఆ నీరు తాగిన ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్లాంట్ల నిర్వహణను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- మినరల్ వాటర్ ప్లాంట్లలో నిబంధనలు గాలికి..
- నాసిరకం నీటిని విక్రయిస్తున్న ప్లాంట్ల నిర్వాహకులు
- ఐఎస్ఐ గుర్తింపు ఉన్న ప్లాంట్లు నామమాత్రమే
- తాగునీటికే నెలకు రూ.3 కోట్లు ఖర్చు
- ప్రజారోగ్యంతో చెలగాటం


నెల్లూరులో నిర్వహిస్తున్న ఆర్‌ఓ ప్లాంట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లావ్యాప్తంగా మినరల్ వాటర్ వ్యాపారం జోరుగా సాగుతోంది. తాగునీటికి ఎప్పుడూ మంచి డిమాండ్ ఉండడంతో నెల్లూరు నగరంతోపాటు మున్సిపాలిటీల్లో దాదాపు ప్రతి వీధిలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రజలు మినరల్ వాటర్‌నే తాగేందుకు ఇష్టపడుతుండడం ప్లాంట్ల నిర్వాహకులకు వరంగా మారింది. దీంతో జిల్లా ప్రజలు ప్రతి రోజూ తాగునీటికి రూ.10 లక్షల చొప్పున నెలకు రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో ప్లాంట్ల నిర్వాహకులు విక్రయిస్తున్న నీటిని తాగిన ప్రజలు కీళ్లు, ఎముకల సంబంధిత వ్యాధుల బారిన పడడంతోపాటు, గుండె, మూత్రపిండాలపై ఈ నాసిరకం నీటి ప్రభావం అధికంగా ఉంటోందని తెలుస్తోంది.

అనుమతులు లేని ప్లాంట్లు

జిల్లాలో మారుమూల గ్రామాల్లో సైతం మినరల్ వాటర్ కల్చర్‌ను వ్యాప్తి చేశారు. అక్కడా ప్లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 550కి పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో కేవలం 50 వాటర్ ప్లాంట్లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు సమాచారం. మంచినీటి పరిశ్రమకు ఐఎస్ఐ సంస్థ 60 రకాల ప్రమాణాలను రూపొందించింది. ఈ ప్రమాణాలను పాటిస్తేనే ఆ సంస్థ మంచినీటి పరిశ్రమలకు అనుమతినిస్తుంది. అనేక మంది వ్యాపారులు ఈ నిబంధనలు పాటించడం లేదు. పెద్ద ఎత్తున బోగస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 50 శాతం క్యాన్ల ద్వారా నీటిని ఇళ్లకు సరఫరా చేస్తుండగా, 50 శాతం ప్లాంట్ల వద్దనే మినరల్ వాటర్ విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రతి రోజూ సరఫరా అవుతున్న వాటర్ క్యాన్లు 75 వేలకు పైనే అని తెలుస్తోంది. వాటర్ క్యాన్లు ప్లాంట్ల వద్దకు తీసుకెళ్లి కొనుగోలు చేస్తే క్యాన్ నీరు రూ.10, ఇంటికి సరఫరా చేస్తే రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. బోగస్ వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ, మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారు. ముఖ్యంగా నగరపాలకసంస్థలో అయితే శానిటేషన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అప్పుడప్పుడు ట్రేడ్ మార్కు విభాగం అనుమతులు ఉండాలి. నిబంధనలు పాటించని ప్లాంట్లు కొత్తవి ఏర్పాటవుతున్నా ప్రభుత్వ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లోరిన్ శాతం ఎక్కువ

తాగునీటిలో 0.5 శాతం నుంచి 0.8 శాతం పీపీఎం క్లోరిన్ ఉండాలి. అయితే ప్రస్తుతం వ్యాపారులు విక్రయిస్తున్న నీటిలో 2 పీపీఎం కన్నా ఎక్కువ క్లోరిన్ శాతం ఉంటుంది. దీంతో బ్యాక్టీరియా, వైరస్ వృద్ధి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం నీటిని బోర్ల నుంచి మాత్రమే వినియోగించాల్సి ఉంది. కొన్ని కంపెనీలు నీటిలో కెమికల్స్ కలిపి మినరల్ వాటర్ పేరు విక్రయిస్తున్నాయి. కొన్ని కెమికల్స్ వినియోగించి క్యాన్లు శుద్ధి చేయాల్సి ఉన్నా పాటించడం లేదు. అలా శుద్ధి చేసిన క్యాన్లను 48 గంటలు వాడకూడదు. అయితే వ్యాపారులు అసలు క్యాన్లనే శుభ్రం చేయడం లేదు. మినరల్ వాటర్‌లో టీడీఎస్ స్థాయిని తగ్గిస్తుండడంతో ఆ నీటిని తాగిన వారికి రోగాలు తప్పడం లేదు. టీడీఎస్ స్థాయి తక్కువగా ఉన్న నీటిని తాగితే మూత్రపిండాలు, గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే లవణాలు తగిన మోతాదులో నీటిలో లేకపోవడం ద్వారా ఎముకల్లో పటుత్వం తగ్గుతుంది. ఇది చిన్నారుల్లో ఎదుగుదల పైనా ప్రభావం పడుతోందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లాలో..
నగరపాలక సంస్థ – నెల్లూరు
మున్సిపాలిటీలు – కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు
మినరల్ వాటర్ ప్లాంట్లు - 550
నిబంధనలు పాటించనివి - 500
ప్రతి రోజూ సరఫరా అవుతున్న వాటర్ క్యాన్లు - 75 వేలకు పైనే..

కాచి చల్లార్చిన నీరే సురక్షితం



మంచినీటి విషయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. కలుషిత నీరు తాగడం వల్ల ముఖ్యంగా మూత్రపిండాల జబ్బులతోపాటు ఎముకల్లో సాంద్రత తగ్గిపోతుంది. గుండె సంబంధిత వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. పూర్తి ప్రమాణాలు ఉన్న నీరు లేనిపక్షంలో కాచి చల్లార్చి వడ్డకట్టిన నీటిని తాగాలి.

– డాక్టర్ గంగాధర్, జనరల్ ఫిజీషియన్, నెల్లూరు

పాటించాల్సిన నిబంధనలు

- వాటర్ ప్లాంట్లలో నీటిని ఏసీసీ, మీడియా, శాండ్, జంబు ఫిల్టర్ ద్వారా వడపోయాలి.
- అవసరమైన కొన్ని రసాయనాలు కలిపిన అనంతరం కీలకమైన ఆర్‌ఓ యంత్రంలో ప్యూరిఫై చేయాలి.
- ఆ నీటిని స్టీల్ ట్యాంకుల్లోకి మళ్లించి ఓజోనేటర్, యులిసిస్టమ్ ప్రక్రియ ద్వారా లోపాలను తొలగించాలి.
- అక్కడి నుంచి మైక్రో ఫిల్టర్ పంపిన తర్వాత కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్ పరిశీలన అనంతరం నీటిని క్యాన్లు, బాటిల్స్‌లో నింపాలి.
- ఈ నమూనాలను ప్రతి నెలా హైదరాబాద్, చెన్నైలలోని ల్యాబ్‌లకు పంపి ధ్రువీకరణ పత్రం పొందాలి.
- వాటర్ క్యాన్లు, బాటిల్స్, ప్యాకెట్లపై ఐఎస్ఐ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలి.

పోలీసుల అదుపులో కిడ్నాపర్

- విచారిస్తున్న దర్గామిట్ట పోలీసులు


నిందితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దర్గామిట్ట పోలీసులు

నెల్లూరు(క్రైమ్): అమ్మమ్మతో గుడికి వచ్చిన మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి ఒంటి పైనున్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన నిందితురాలిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించగా పాతనేరస్తురాలని తేలింది. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన టి.పద్మ గత నెల 24న తన మనుమడు సవ్యసాక్షిత్‌ను తీసుకుని కొరెంటాఫీస్ వద్దనున్న రాజరాజేశ్వరి ఆలయానికి వచ్చారు. పద్మ పూజలు చేస్తుండగా గుర్తుతెలియని మహిళ బాలుడిని కిడ్నాప్ చేసి ఆటోలో తనవెంట తీసుకెళ్లింది. బాలుడి ఒంటి పైనున్న ఒకటిన్నర సవర్ల బంగారు ఆభరణాలను దోచుకుని ఆత్మకూరు బస్టాండ్‌లో వదిలి పరారైంది. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

గుడికి వచ్చి పోలీసులకు చిక్కి..

సీసీ ఫుటేజీల్లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు నిందితురాలి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిందితురాలు రాజరాజేశ్వరి ఆలయానికి వచ్చింది. ఆలయంలో ప్రదక్షిణలు చేస్తుండగా కొందరు మహిళలు ఆమెను గుర్తించి ఆలయ సిబ్బందికి తెలియజేశారు. అందరూ ఆమెను పట్టుకుని దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య, ఎస్సై రమేష్‌బాబు సిబ్బందితో ఆలయానికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించారు.

గతంలోనూ దొంగతనం కేసు

నిందితురాలు టీపీగూడూరు మండలం చంద్రశేఖరపురానికి చెందిన కె.కీర్తి. కొన్నేళ్ల క్రితం నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో కమ్మలు అపహరించిన ఘటనలో ఆమెపై దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెలలో బాలుడిని కిడ్నాప్ చేసి ఒంటి పైనున్న బంగారు గాజులు, డాలర్ తదితరాలు దోచుకుని పరారైంది. ఈ తరహా నేరాలకు గతంలో ఏమైనా పాల్పడిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తోన్న వ్యభిచార గృహంపై దర్గామిట్ట పోలీసులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయలక్ష్మి అనే మహిళ గత కొంతకాలంగా నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం వెనుక వీధిలో ఓ ఇంట్లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తోంది. నెల్లూరు నగరంతోపాటు పలు ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను తీసుకుని వచ్చి వారితో వ్యభిచారం చేయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు హరనాథపురానికి చెందిన విటుడు నారాయణరెడ్డిని అరెస్ట్ చేశారు. ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు.

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 136

వీరంపల్లిలో ప్రాచీన అవశేషాలు

- ఆ ప్రాంతాన్ని సందర్శించిన పురావస్తుశాఖ అధికారులు

మనుబోలు: జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుడు షేక్ రసూల్ అహ్మద్ తన పరిశోధనలో భాగంగా ఇటీవల మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో ప్రాచీన చారిత్రక అవశేషాలను గుర్తించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ఈ నెల 16వ తేదీన పత్రికల్లో ప్రచురితమైన వార్తకు స్పందించిన కేంద్ర ప్రభుత్వ శాసన అధ్యయన విభాగం చెన్నై శాఖకు చెందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎపిగ్రాఫిస్ట్ ఎం.ఏసుబాబు, అలగేశన్, యువరాజ్‌లతో కలిసి శుక్రవారం వీరంపల్లిలో పర్యటించి ప్రాచీన అవశేషాలు లభించిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ శిథిలమైన ఆలయ పరిసరాల్లో ఉన్న వెయ్యేళ్ల నాటి జైన విగ్రహం రక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట చరిత్రకారులు అక్బర్‌బాషా, రసూల్ ఉన్నారు.

వెటర్నరీ డాక్టర్లు ఎంతో కీలకం

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): వెటర్నరీ డాక్టర్లు ఎంతో కీలకమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా నగరంలోని పరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని, ప్రాణాపాయంలో ఉన్న వారికి ఈ రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పాల్గొని ఇటీవల వెటర్నరీ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, నాగేశ్వరరావు, వసంతరాయులు, సీవీ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, జయచంద్ర, కె.అరుణ, వెంకటస్వామిరెడ్డి, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

సంగం: మండలంలోని జెండాదిబ్బ అంబేడ్కర్ కాలనీలో ఓ దుకాణం వద్దకు వచ్చిన 15 ఏళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన యువకుడిపై శుక్రవారం పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. కాలనీలో 15 ఏళ్ల బాలిక శుక్రవారం మధ్యాహ్నం ఓ దుకాణం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో అదే కాలనీకి చెందిన రమేష్ అనే యువకుడు బాలికను మధ్యలో అటకాయించి లైంగికదాడికి ప్రయత్నించాడు. తన బైక్‌పై ఎక్కాలని బెదిరించాడు. దీంతో ఆందోళన చెందిన బాలిక పెద్దగా కేకలు వేసి ఇంటికి వెళ్లి జరిగిన ఘటనపై తల్లిదండ్రులకు వివరించింది. బాలిక తల్లిదండ్రులు రమేష్ ఇంటి వద్దకు వెళ్లి అతనిని అడగ్గా వారిపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): చెట్టుకు ఉరేసుకొని ముటుకుందు వెంకటేశ్వరరెడ్డి(19) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మర్రిపాడు మండలం చిలకపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై విశ్వనాథరెడ్డి వివరాల మేరకు అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వెంకటేశ్వరరెడ్డి తమ ఇంటి వెనుక గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు అర గంట సమయం తర్వాత గ్రామస్తులు గుర్తించి కుటుంబసభ్యులకు, సచివాలయ పోలీసుకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.


వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బృందావనంకు చెందిన సుబ్రహ్మణ్యం గత కొంతకాలంగా కుక్కలగుంటలో సింగిల్ నంబర్ ఆట నిర్వహిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న సంతపేట ఎస్సై వాసు శుక్రవారం దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.1,380 నగదు, సెల్‌ఫోన్, లాటరీ స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతంలో రమణయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలం క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఆయన పెద్ద కుమార్తె మాధవి వద్ద ఉంటున్నారు. పక్షవాతం బారినపడి ఇటీవల ఆయన కోలుకుంటున్నాడు. ఈ క్రమంలోనే తరచూ మద్యం తాగుతుండడంతో ఆరోగ్యరీత్యా వద్దని కుమార్తె వారించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 19వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కుమార్తె ఆయన కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

లైంగికదాడి యత్నం కేసులో యువకుడి అరెస్ట్

సంగం: స్థానిక వడ్డెరపాళెంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో 7వ తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగికదాడికి ప్రయత్నించిన యువకుడు సీహెచ్ చిరంజీవిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన చల్లా చిరంజీవి ఆ ఇంట్లోకి ప్రవేశించాడు. టీవీ సౌండ్ పెంచి బాలికపై లైంగికదాడికి ప్రయత్నించాడు. అదే సమయంలో బాలిక సోదరుడు రావడంతో చిరంజీవి పరారయ్యాడు. శుక్రవారం చిరంజీవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, థింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లీష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన


మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.